క్లుప్తంగా

గైనకాలజిస్ట్ సుజాత బాధ్యతల స్వీకరణ



పెదకూరపాడు : పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్ డాక్టర్ కూచిపూడి సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మెడికల్ ఆఫీసర్ విద్యకు ఆమె జాయినింగ్ రిపోర్టును అందించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఫీల్డ్ ఆపరేషన్ సపోర్టింగ్ సిస్టమ్‌లో జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఇప్పటి వరకు డాక్టర్ సుజాత సేవలందించారు. గతంలో సత్తెనపల్లి, తెనాలిలో గైనకాలజిస్ట్‌గా పనిచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన ప్రసవ సేవలు అందిస్తానని ఆమె తెలిపారు.

నాయీబ్రాహ్మణ సంఘం నాయకురాలు గోవిందమ్మ మృతి



పెదకూరపాడు : నాయీబ్రాహ్మణ సంఘం నాయకురాలు మునుగోటి గోవిందమ్మ (75) మృతి నాయీబ్రాహ్మణ సంఘానికి తీరనిలోటని రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ కమిటీ సభ్యులు మద్దిరాల గంగాధర్ అన్నారు. మండలంలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన మునుగోటి గోవిందమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మద్దిరాల గంగాధర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ గోవిందమ్మ మృతి నాయీబ్రాహ్మణ సంఘానికి తీరని లోటని వారి కుటుంబానికి నాయీబ్రాహ్మణ సంఘం అండగా ఉంటుందని ఆయన అన్నారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సంఘం నాయకులు మార్కాపురం బాజీ హుస్సేన్, ప్రసాదు, బ్రహ్మేశ్వరరావు, చిరంజీవి, శ్రీనివాసరావు, సామ్రాజ్యం, చంద్రావతి, లీలావతి, శివ లీల ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామంలో పల్లె పండుగలో ఇచ్చిన హామీలో భాగంగా గ్రామంలో రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, రూ.8 లక్షలతో నూతనంగా నిర్మించిన సైడ్ డ్రెయిన్స్, రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన కల్వర్టును గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం సత్తెనపల్లి మండలం గండ్లూరు గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ల అమరేశ్వరరావు, తొరటి వెంకట్రావు ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

సత్తెనపల్లి: కిట్స్ సంస్థ (ఎన్జీవో) విజయవాడ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయు జీకేవై కార్యక్రమం ద్వారా జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ (జెఎస్‌డీ) కోర్సులో 6 నెలల పాటు విజయవాడ సెంటర్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ అందించి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరి ప్రసాద్ గురువారం తెలిపారు. కోర్సు వ్యవధి ఆరు నెలలు ఉంటుందని, వయసు 20–30 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. విద్యార్హతలు ఏదైనా డిగ్రీ, పీజీ పాస్/ ఫెయిల్, ఇంజనీరింగ్ పాస్/ ఫెయిల్, కేవలం కంప్యూటర్ బ్యాక్ గ్రౌండ్ విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించ బడతాయన్నారు. శిక్షణ అనంతరం ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సర్టిఫికెట్, 100 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించ బడతాయన్నారు. వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 28న బ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు.

ఉగ్ర దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

నకరికల్లు: ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారి ఆత్మ శాంతించాలని పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు జవ్వాజి సుబ్బయ్య అన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కాళంగి ఉమ, కోట శ్రీను, తిమ్మారెడ్డి, ఆతుకూరి పూర్ణ, జవ్వాజి సాంబయ్య, ప్రసన్న, చింతపల్లి ఫకీర్ అహ్మద్, బండి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

అచ్చంపేట: స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయ శాఖాధికారి బి.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలియచేశారు. విద్యార్థులకు విజ్ఞాన, వినోదాత్మక, క్రీడా, ఆధ్యాత్మిక విషయాలపై శిక్షణ ఇవ్వబడుతుందని చెప్పారు. అన్ని వర్గాలవారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, ఇతరులెవరైనా ఈ సదవకాశాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.

మొక్కుబడిగా పోషణ్ పక్వాడా

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫొటోలకే పరిమితమైన కార్యక్రమం
- పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంలో విఫలం
- గ్రామాల్లో నామమాత్రంగా పక్షోత్సవాలు
- కొరవడిన ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ



న్యూచిట్యాలలో మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

బెల్లంకొండ: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలతో పాటు కిశోర బాలికలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఈ ఏడాది ఈ నెల 8 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. 15 రోజులపాటు ప్రతి కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం, బాల్యవివాహాలు వంటి అంశాలపై ర్యాలీలు, సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ మండలంలోని చాలా కేంద్రాల్లో ఐసీడీఎస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. మండల పరిధిలో రెండు, మూడు కేంద్రాల్లో మినహా మిగిలిన కేంద్రాల్లో మమ అనిపించారు.

అవగాహన కల్పనే ధ్యేయం

గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు తెలియజేసేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. అవగాహన లోపంతో పౌష్టికాహారం తీసుకోకపోవడంతో రక్తహీనత సమస్య ఏర్పడి గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలు కూడా పౌష్టికాహార లోపంతో అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలాంటి వాటిని అరికట్టేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను వేదికగా చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేరువ చేయాలన్నది లక్ష్యం. కానీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. పౌష్టికాహారం అందించడం పక్కన పెడితే అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు.

ఫొటోలకే పరిమితం

పోషణ్ పక్వాడా కార్యక్రమం ద్వారా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేసి వివరించాలి. గ్రామాల్లో ప్రత్యేక ర్యాలీలు, సదస్సులు ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలను చైతన్యం చేయాల్సి ఉంది. మండల పరిధిలో ఒకటి, రెండు కేంద్రాలలో నామమాత్రంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. మిగిలిన కేంద్రాల్లో ఆ ఊసే లేదు. కార్యక్రమం నిర్వహించామని చెప్పుకునేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు సెంటర్లో, సెంటర్ ముందు బ్యానర్ పట్టుకొని ఫొటో దిగి దాన్ని ఉన్నతాధికారులకు పంపి మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పని ఒత్తిడితో అధికారులు కేంద్రాలను సందర్శించడం లేదు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహార ప్రాముఖ్యత, తమ ఇంటి దగ్గర ఆకు కూరలు, కూరగాయల పెంపకం, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, వంటి అనేక అంశాలు తెలియజేయడానికి ప్రభుత్వాలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు మొక్కుబడిగా తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. ముఖ్యంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో జరగాల్సిన చాలా కార్యక్రమాలు తూతూ మంత్రంగా తప్ప వాటి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

కార్మికులకు సాధికారత కల్పించేందుకు సమగ్ర సర్వే



కమిషనర్ ఆనంద్ కుమార్‌కు ఉత్తర్వుల కాపీ అందిస్తున్న మల్లెల చిన్నప్ప

సత్తెనపల్లి: అసంఘటిత కార్మికులకు సాధికారత కల్పించేందుకు సమగ్ర సర్వే జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీలో చెత్తను సేకరిస్తూ ఈఎస్ఐ, పీఎఫ్ లేనటువంటి వారు కూడా ఈ సర్వేలో అర్హులని, దానికి సంబంధించిన ఉత్తర్వుల కాపీని గురువారం మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్‌కు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మల్లెల చిన్నప్ప అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనందకుమార్ మాట్లాడుతూ సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో ఉన్న పొడి చెత్తను సేకరించే అసంఘటిత కార్మికుల వ్యక్తిగత వివరాలు, వారి సామర్థ్యాల అంచనా కోసం, సమగ్ర సర్వే నిర్వహించటం జరుగుతుందన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే) అనేది పొడి వ్యర్థాలను ఏరుకునేవారు, పారిశుద్ధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్య మెరుగుదలకు తగిన శిక్షణ అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన పథకమన్నారు. ప్రతి పట్టణంలో అసంఘటిత కార్మికులను 'నమస్తే' పథకం పేరిట ఎన్యూమరేషన్ చేసేందుకు ఒక యాప్‌ను రూపొందించామన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మల్లెల చిన్నప్ప 8 జిల్లాలో ఈ పథకంలో ఎన్యూమరేషన్ చేపట్టనున్నట్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్ విజయసారథి ఆధ్వర్యంలో నమస్తే ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందన్నారు.

మే 1 నుంచి గ్రామీణ బ్యాంకులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు



అవగాహన కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు

దొడ్లేరు(క్రోసూరు): రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు ప్రభుత్వ ఆదేశాల మేరకు మే ఒకటవ తేదీ నుంచి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులు యూనియన్ బ్యాంకు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారబోతున్నట్లు దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అధికారులు గురువారం తెలిపారు. దొడ్లేరులో ఖాతాదారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ బాణావత్ శివశంకర్ నాయక్, సీనియర్ మేనేజర్ కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ మార్పు వలన ఖాతాదారుల ఖాతాల సంఖ్యలో మార్పు ఉండదని, లావాదేవీలకు ఎటువంటి ఆటంకం ఉండదని, ఖాతాదారులకు అందించే సేవల్లో నాణ్యత కొనసాగించ బడుతుందని, ఖాతాదారులకు ఎటువంటి సందేహాలున్నా సంబంధిత బ్యాంకు శాఖల్లో సంప్రదించాలని తెలిపారు. కావున ఖాతాదారులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పేదింటి బిడ్డ.. మార్కుల పంట



ఈశ్వర్‌ను సత్కరించి అభినందిస్తున్న ఎంఈవోలు, ప్రిన్సిపాల్

రాజుపాలెం: పేదింటి బిడ్డ చదువులో రాణించి ఆదర్శంగా నిలిచాడు. ఒక వైపు తల్లి అనారోగ్యం, మరో వైపు కుటుంబ పేదరికం వెంటాడుతున్న తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించాడు. బుధవారం వెలువడిన పది ఫలితాలలో 600కు 595 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. రాజుపాలెంకు చెందిన శీలం వెంకట్రావు, త్రివేణిల ద్వితీయ కుమారుడు శీలం ఈశ్వర్ స్థానిక నవోదయ పాఠశాలలో చేరాడు. విద్యార్థి తల్లిదండ్రుల పరిస్థితి అర్థం చేసుకున్న ప్రిన్సిపాల్ పి.రామారావు 9, 10 తరగతులకు ఉచితంగా విద్యను అందించారు. తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా, తండ్రి రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని ఈదుకొస్తున్నాడు. తండ్రి సంకల్పం, పాఠశాల సహకారంతో 595 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా ఎంఈవో-1 మల్లిఖార్జునశర్మ, ఎంఈవో-2 నరసింహారావులు ఈశ్వర్‌ను గురువారం సత్కరించి అభినందించారు. పై చదువులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎంఈవోలు భరోసా ఇచ్చారు. భవిష్యత్‌లో సివిల్స్ లక్ష్యమని ఈశ్వర్ చెప్పాడు.

మండలంలో 91 శాతం ఉత్తీర్ణత



మునగోడలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

అమరావతి: మండలంలో ఆరు ప్రభుత్వ పాఠశాలలు, ఆరు ప్రైవేటు పాఠశాలల్లో 573 మంది పది పరీక్షలు రాయగా 520 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. నాలుగు జిల్లా పరిషత్, రెండు ఎయిడెడ్, ఒక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కలిపి 298 మంది పరీక్షలు రాయగా 255 మంది ఉత్తీర్ణులవ్వగా 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఏకుల ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో 60 మందికి 56 మంది, లింగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 మందికి 9 మంది, మండెపూడిలో 35 మందికి 26 మంది, మల్లాదిలో 15 మందికి 13 మంది, మునగోడులో 60 మందికి 49 మంది, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 115 మందికి 103 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. మునగోడు జడ్పీ హైస్కూల్లో 581 మార్కులు సాధించి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్‌కే షహీరాబానుతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌కు చెందిన బి.రమ్య 567 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు.

+ అలాగే ప్రైవేటు విద్యా సంస్థల్లో 275 మంది పరీక్షలు రాయగా 265 మంది ఉత్తీర్ణులై 96 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. శాంతినికేతన్ హైస్కూల్‌లో 31 మందికి 26 మంది, శ్రీరామకృష్ణ హిందూ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 72 మందికి 71 మంది, వినూత్న హైస్కూల్‌లో 42 మందికి 41మంది, మార్గదర్శి హైస్కూల్‌లో 14 మందికి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత, 14వ మైల్ వీనస్ హైస్కూల్‌లో 51 మందికి 49 మంది, చైతన్య హైస్కూల్‌లో 65 మందికి 64 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రైవేట్ స్కూళ్లలో లక్ష్మీ సౌజన్య 586, ఉషావ్య 583, శ్రీనిధి 579, విజయ 578, బిందు 566, వర్షిణి ప్రియ 562 మార్కులు సాధించారని తెలిపారు.

పంచాయతీల అభివృద్ధితో దేశం సర్వతోముఖాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీవో వై.హనుమారెడ్డి



క్రోసూరులో మానవహారం చేపట్టిన పంచాయతీరాజ్ అధికారులు



ఎంపీడీవో కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పంచాయతీరాజ్ సిబ్బంది



పంచాయతీరాజ్ దినోత్సవానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు

పలు చోట్ల ఘనంగా పంజాయతీరాజ్ దినోత్సవం

సత్తెనపల్లి: పంచాయతీలు అభివృద్ధి చెందినపుడే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ఆగమనంతో పల్లెల స్వరూపం మారిపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పంచాయతీలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ ఎంపీడీవో ఏ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 29 అంశాలపై పంచాయతీలకు అధికారాలు ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో కనీస అవసరాలు తీర్చడంలో పంచాయతీరాజ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ ఏఈ రామ్ మోహన్ సింగ్ మాట్లాడుతూ గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారం కావాలంటే పంచాయతీరాజ్ వ్యవస్థ ముఖ్య పాత్ర పోషించాలని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో పంచాయతీరాజ్ వ్యవస్థ ముందుంటుందని వెల్లడించారు. ఎంఈవో ఏ శ్రీనివాసరావు పంచాయతీరాజ్ వ్యవస్థ ఆవిర్భావ తీరుతెన్నులను వివరించారు. ఈ సందర్భంగా మండలంలో ఉత్తమ సేవలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: గ్రామ పంచాయితీల అభివృద్ధిని సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది బాధ్యతగా భావించాలని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పంచాయతీ అధికారులు నిర్వహించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకలలో ఎంపీడీవో పాల్గొన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మండలంలోని ఎమ్మాజీగూడెం, పాపాయపాలెం, వెంకటాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు, వన్నాయపాలెం, మాచాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, నాగిరెడ్డిపాలెం, గంగిరెడ్డిపాలెం, బెల్లంకొండ గ్రామాలలో వివిధ శాఖల అధికారులు వేడుకలలో పాల్గొన్నారు. గ్రామ పంచాయితీలను అభివృద్ధి చేసుకునేందుకు ముందస్తు ప్రణాళికలను అధికారులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గిరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: మండలంలోని అన్ని పంచాయతీల్లో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించినట్లు పంచాయతీరాజ్ విస్తరణాధికారి పి.వెంకయ్య తెలిపారు. గ్రామ సర్పంచ్ మల్లా చందమామ అధ్యక్షతన క్రోసూరులో జరిగిన గ్రామ సభలో పలువురు అధికారులు పాల్గొని ప్రసంగించారు. గ్రామ సభలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యు.మల్లికార్జునరావు మాట్లాడుతూ క్రోసూరు చెరువులో నీళ్లు లేకుండా చేయటంతో సమస్య వచ్చిందన్నారు. వచ్చే సంవత్సరం నుంచి నీటిని వేసవి ముందుగా బయటకు వదలకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో కృషి చేస్తానన్నారు. బోర్ల మరమ్మతు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయటం చేయనున్నట్లు తెలిపారు. క్రోసూరులో రెండు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా క్రోసూరును క్లీన్, గ్రీన్‌గా తీర్చిదిద్దుదామని తీర్మానించారు. అనంతరం క్రోసూరు నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించి అందుకూరు రోడ్డు సెంటర్‌లో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ షేక్ మస్తాన్, అధికారులు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, గ్రామ సచివాలయాల సిబ్బంది, పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలని ఎంపీపీ మేచారపు అనురాధ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎంపీపీ మేచారపు అనురాధ, సర్పంచ్ పరసా అంజమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ కీలకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, మాజీ సర్పంచ్‌లు భువనం ఉమాదేవి, సంగుల కొండలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి



మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ


రాజుపాలెం: గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వాహణ, తాగునీటి సరఫరా, రహదారుల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పని చేస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ పగడాల ముక్కంటి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అధికారులకు అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి అధికారాలు కల్పించారని, ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించినట్లు తెలిపారు. 2010 నుంచి ప్రతి ఏటా ఈ సవరణ ద్వారా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లిఖార్జునశర్మ, మండల పరిషత్ ఏవో బసవ కుమారి, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వడదెబ్బకు గురై వ్యవసాయ కూలీ మృతి



మాదల(ముప్పాళ్ళ): వ్యవసాయ పనులకు వెళ్లిన వ్యక్తి పనులు చేస్తూ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందిన ఘటన మండలంలోని మాదల గ్రామంలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీకాంత్(36) రోజూ లాగే వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాడు. పనుల్లో భాగంగా ధాన్యం బస్తాలు పడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతికి వడదెబ్బ కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. గతంలోను ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

జన్మదినం రోజే.. అనంత లోకాలకు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల-దీపాలదిన్నెపాలెం గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన చట్టా మహేష్ (24) క్రోసూరులో బజాజ్ మైక్రో ఫైనాన్స్ ఆపరేషన్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. పుట్టినరోజు కావడంతో త్వరగా విధులు ముగించుకొని తిరిగి గుడిపూడిలో ఇంటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై క్రోసూరు నుంచి రెంటపాళ్ల-దీపాలదిన్నెపాలెం మార్గంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన పాల వాహనం ఢీ కొట్టింది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

అచ్చంపేట: గుర్తు తెలియని వ్యక్తులు యువకునిపై దాడి చేసి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని వేల్పూరులో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ విషయం గురువారం సాయంత్రం వరకు గోప్యంగా ఉంచారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వేల్పూరుకు చెందిన పొన్నెకంటి హరీష్ తన నివాసంలో ఒక్కడే నిద్రిస్తుండగా రాత్రి సుమారు 12 గంటల సమయంలో ఇరువురు వ్యక్తులు లోనికి ప్రవేశించి తీవ్రంగా హింసించారు. వారు పెట్టే హింసలకు సొమ్మసిల్లి పడిపోయిన హరీష్ మూలుగుతూ రాత్రంతా గడిపాడు. తెల్లారి ఇరుగు పొరుగు వారు వచ్చి చూడగా అపస్మారక స్థితిలో హరీష్ కనిపించాడు. విషయాన్ని అచ్చంపేట పోలీసులకు తెలయజేయగా సీఐ సి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములు అన్వేషణ ప్రారంభించాయి. ఒక్కడే ఉండటాన్ని గమనించి దాడి చేయాల్సిన అవసరం ఏమి వచ్చింది, గాయపరచేందుకే వచ్చారా, ఎవరై ఉండవచ్చనే పూర్తి వివరాలు తెలయవలసి ఉంది. సీఐ తనదైన పంథాలో కేసు విచారణ ప్రారంభించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం



బెల్లంకొండ: విద్యుత్‌లైన్లకు సంబంధించిన పనులు చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు భద్రాచలం ప్రాంతానికి చెందిన కార్మికుడు కేతావతు రవినాయక్(40)గా గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో గత కొద్ది రోజులుగా 24 గంటల వ్యవసాయ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధిత కాంట్రాక్టర్ తెలంగాణ నుంచి కార్మికులను తీసుకువచ్చారు. గురువారం రాత్రి పనులు చేస్తుండగా విద్యుత్ స్తంభంపై ఉన్న రవినాయక్‌కు ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్ తగిలి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు మహంకాళి అమ్మవారి తిరునాళ్ల



మాదల(ముప్పాళ్ళ): భక్తుల పాలిట కొంగు బంగారంగా విలసిల్లే మాదల మహంకాళి అమ్మవారి 45వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 26వ తేదీన జరగనుంది. ఆ మేర అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరునాళ్లను పురస్కరించుకొని ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఆలయం ముందు పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యంతో పాటు అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా శ్రీరామనవమి తర్వాత తిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నరసరావుపేట ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్లలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.